క్లుప్తంగా

ఘనంగా వార్షికోత్సవం



విద్యార్థులకు విద్యాసామగ్రిని ఇస్తున్న సర్పంచ్ గౌతమి, ఎంఈఓ లలితకుమారి

చంద్రగిరి (తిరుపతి రూరల్): ఇష్టంగా చదవడం ద్వారా మన తలరాతలు మనమే మార్చుకోవచ్చని ఎంఈఓ లలితకుమారి అన్నారు. చంద్రగిరి మండలం దోర్నకంబాల పంచాయతీ మొండికాల్వ స్కూలులో సోమవారం పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పూలతో ఓం ఆకారం వేసి, కొవ్వొత్తులతో ఉపాధ్యాయులకు విద్యార్థులు స్వాగతం పలికారు. సర్పంచ్ గౌతమి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, ఇతర విద్యాసామగ్రిని వితరణ చేశారు.

23న ఘంటసాల పాటల పోటీలు

తిరుపతి కల్చరల్: ఘంటసాల గాన కళాపీఠం ఆధ్వర్యంలో ఈనెల 23న మహతి కళాక్షేత్రంలో ఘంటసాల పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ కళాపీఠం అధ్యక్ష, కార్యదర్శులు విజయకుమార్‌రెడ్డి, ఉదయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పోటీలు ఉంటాయని అనంతరం సాంస్కృతిక కళా ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు 9177707201, 9849660992 నంబర్లను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఆదినారాయణరెడ్డి



చంద్రశేఖర్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : ఎస్వీ యూనివర్సిటీ రిటైర్డ్ టీచర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రొఫెసర్ పి.ఆదినారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ప్రొఫెసర్ ఉగ్రాణం చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శిగా ప్రొఫెసర్ వీఆర్‌సి.కృష్ణయ్య, సంయుక్త కార్యదర్శిగా ప్రొఫెసర్ టి.వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ప్రొఫెసర్ ఎస్.శ్రీనాథ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ప్రొఫెసర్లు ఎం.హనుమంతరావు, వి.దయాకర్‌రెడ్డి, వి.బాలకృష్ణమనాయుడు, ఎస్.మునిరత్నమ్మ, కె.కృష్ణయ్య, ఎస్.బాల ఎరికలరెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం వీరు ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.


అగ్ని ప్రమాదాలపై అవగాహన



మంటలు ఆర్పడంపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

పాకాల: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాలపై జింకలమిట్టకు సమీపంలోని స్నామ్ అల్లాయ్ ఫ్యాక్టరీలో సోమవారం ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ విశ్వనాథం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫ్యాక్టరీల్లో అధికంగా జరిగే ప్రమాదాలతోపాటు గ్యాస్, ఫైర్స్, ఆయిల్ ఫైర్స్ ఎలా చోటుచేసుకుంటాయి? వాటిని ఎలా నివారించాలి? అనే అంశాలపై ప్రదర్శనపూర్వకంగా ఫైర్ సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ కార్మికులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఉద్యమిస్తాం



కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏఐటీయూసీ నేతలు

తిరుపతి కల్చరల్: విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వంపై మరో పోరాటంతో ఉద్యమిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ ప్రకటించారు. ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికుల పోరాటానికి మద్దతుగా సోమవారం బైరాగిపట్టెడ పద్మావతి పార్క్ వద్ద కేంద్ర ప్రభుత్వం దిష్టి బొమ్మను దహనం చేసి వారు మాట్లాడారు. అన్ని కార్మిక సంఘాలను విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు ఎన్‌డీ.రవి, సర్దార్ శివ, గోవిందస్వామి, ఏపీ.బాల, పూర్ణ, ఎల్‌కే.నాయుడు, ఆర్‌పీ.రమేష్, ప్రమీల, విశ్వనాథ్ ఎన్.శివ పాల్గొన్నారు.

బైపాస్‌లో ట్రాఫిక్ ఇక్కట్లు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బైపాస్‌రోడ్డులో సోమవారం ట్రాఫిక్ స్తంభించింది. సోమవారం రాత్రి ఓ లారీకి చిన్న ప్రమాదం జరగడంతో తిరుపతి–నెల్లూరు మార్గంలో వాహనాలు రెండు గంటల పాటు స్తంభించిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులు, రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ప్రతి ఇంటా సంక్షేమమే



జగన్‌తో పాటు మీరంతా చల్లగా ఉండాలయ్యా! అంటూ అభినయ్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న లక్ష్మీపురంలోని వృద్ధురాలు పట్టమ్మ



27వ డివిజన్‌లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మేయర్ డాక్టర్ శిరీష

- మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమనఅభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: దేశంలోనే ఎవరికీ సాధ్యం కానన్ని సంక్షేమ పథకాలను రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి ప్రతి ఇంటికీ ఇంటికీ సంక్షేమ ఫలాలను అందజేశారని తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పునరుద్ఘాటించారు. తిరుపతి 27వ డివిజన్‌లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని మేయర్, అలాగే 3వ డివిజన్ లక్ష్మీపురంలో గణేష్, డివిజన్ అధ్యక్షులు వెంకటేష్ ఆధ్వర్యంలో భూమన అభినయ్‌రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో జగనన్న అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు మేయర్, డిప్యూటీ మేయర్ వివరించారు. అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు లేక నానా అవస్థలు పడుతున్న తమకు జగనన్న సొంతింటి కల నెరవేర్చారు నాయనా! అంటూ 3వ డివిజన్‌లోని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. 'జగనన్న అమ్మ ఒడి'తో తమ పిల్లలను బాగా చదివిస్తున్నామని, అలాగే 'చేయూత' డబ్బులతో చిన్నచిన్ని వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నట్టు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకే మద్దతు ఇవ్వాలని శిరీష, అభినయ్‌రెడ్డి ప్రజలను కోరారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంక్ డైరెక్టర్లు వెంకటేష్ రాయల్, మబ్బు నాదమునిరెడ్డి, పార్టీ నాయకులు మునిరెడ్డి, కంకనాల రమేష్, ధనశేఖర్, కోటి ముద్రరాజ్, కిరణ్, పాండు, రాజేష్, యమునమ్మ, శివ ఆచ్చారి, రామ్మూర్తి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా మైదానంలో సౌకర్యాలు కల్పించరూ!

- 'స్పందన'లో కమిషనర్‌కు వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఈద్గా కమిటీ ప్రతినిధులు

తిరుపతి తుడా : రంజాన్ వేడుకలకు ఈద్గా మైదానంలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరితకు ముస్లిం జేఏసీ ప్రతినిధులు వినతిపత్రం ఇచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్.కె బాబు, ఈద్గా కమిటీ ప్రతినిధులు ఖాదర్‌బాషా, షఫీ మహ్మద్ ఖాద్రీ, ఇమ్రాన్, చాంద్‌బాషా, గఫూర్ తదితరులు కమిషనర్ హరితను కలిసి పైవిధంగా కోరారు. అలాగే, అనాథ శవాల దహనక్రియలకు వైకుంఠ రథం ఏర్పాటు చేయాలని ఎస్‌కె బాబు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో సిమెంట్ ఫ్లోరింగ్ వేయించాలని, ప్రజలకు అవసరమైన కుర్చీలు ఏర్పాటు చేయించాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ సూచించారు. కోర్టు సముదాయం నుంచి భేరివీధి వరకు ఉండే పెద్ద కాలువలో షీల్డు తక్షణం తొలగించాలని కార్పొరేటర్ నరసింహాచారి కోరారు. ఫిర్యాదులు, వినతులపై సమీక్షించిన కమిషనర్ ఆయా సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్‌ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, రెవెన్యూ ఆఫీసర్ కెఎల్ వర్మ, ఎంఈయూలు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, ఏసీపీలు బాలసుబ్రమణ్యం, షణ్ముగం, డీఈఈలు విజయ్‌కుమార్ రెడ్డి, దేవిక, రవీంద్రారెడ్డి, సంజయ్‌కుమార్, మహేష్, గోమతి, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

24న 'రాయలసీమ కర్తవ్య దీక్ష'

తిరుపతి కల్చరల్: కర్నూలులోని ఎస్టీ,బీసీ కళాశాల మైదానంలో ఈనెల 24న నిర్వహించనున్న రాయలసీమ కర్తవ్య దీక్షలో విద్యార్థి సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు పాల్గొని జయప్రదం చేయాలని రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ పి.నవీన్‌కుమార్ రెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన రాయలసీమ కర్తవ్య దీక్ష కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. విభజన తర్వాత రాయలసీమ చాలా నష్టపోయిందని, వెనుకబడిన సీమకు సమ న్యాయం కోసం ఈ దీక్షను రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో రాయలసీమ పోరాట సమితి నేతలు శ్రీకాంత్, నరసింహ, గట్టు నవీన్, వినోద్, చిన్ని, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థలను ధారాదత్తం చేస్తున్న మోదీ

- పాదయాత్రలో వామపక్షాల విమర్శ



పాదయాత్ర చేస్తున్న సీపీఎం, సీపీఐ నేతలు

తిరుపతి కల్చరల్: దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్న మోదీని ఇంటికి సాగనంపుదామని సీపీఐ, సీపీఎం నేతలు పిలుపునిచ్చారు. సీపీఎం, సీపీఐ నేతల సంయుక్త ఆధ్వర్యంలో మోదీని గద్దె దించండి–దేశాన్ని కాపాడండి నినాదంతో చేస్తున్న పాదయాత్రలో భాగంగా 4వ రోజు సోమవారం జీవకోనలో ప్రచార పాదయాత్ర చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు వి.నాగరాజు, పి.మురళి మాట్లాడారు. కేంద్రం న్యాయవ్యవస్థను, సీబీఐ, ఎన్నికల కమిషన్‌ను తమ గుప్పెట్లో పెట్టుకుని గొంతెత్తిన వారిపై అక్రమ కేసులు బనాయించి మోదీ ప్రభుత్వం జైల్లో పెడుతోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నేతలు విశ్వనాథ్, సుబ్రమణ్యం,చలపతి, రాధాకృష్ణ, ఎన్‌డీ.రవి, ఉదయ్‌కుమార్, గోవిందస్వామి, రామచంద్రయ్య, కాళయ్య, పద్మనాభరెడ్డి, సురేష్, మాధవ్, బుజ్జి, చిన్న, మల్లికార్జునరావు, రమేష్, రాజు, రవి పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితులకు జైలు

తిరుపతి లీగల్ : తిరుమలలో జరిగిన వేర్వేరు చోరీ కేసుల్లో ఐదుగురు నిందితులకు ఒక్కొక్కరికి 2నెలల జైలుశిక్ష, రూ.100 చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు సోమవారం తీర్పుచెప్పారు. గతనెల 10న తిరుమలలో తెలంగాణకు చెందిన ఓ భక్తుడి సెల్‌ఫోన్, ఓ భక్తురాలి హ్యాండ్‌బ్యాగ్‌లో రూ.5000 వేలు అపహరణకు గురైంది. బాధితుల ఫిర్యాదుల మేరకు తిరుమల టూటౌన్ స్టేషన్ ఎస్‌ఐ మంజుల కేసు దర్యాప్తు చేశారు. రాజస్థాన్ అల్వార్ జిల్లాకు చెంది ప్రస్తుతం హైదరాబాద్ నాంపల్లి రైల్వేస్టేషన్‌లో సమోసాలు విక్రయిస్తున్న ప్రదీప్ ఈ చోరీ చేసినట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. అలాగే గతనెల 15న తిరుమలలో కర్ణాటకకు చెందిన ఓ భక్తుడి లగేజీ బ్యాగు చోరీకి గురైంది. తిరుమల టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి కర్ణాటక హసన్ జిల్లాకు చెందిన ఎస్.హరీష్, తమిళనాడు తిరువణ్ణామలై జిల్లాకు చెందిన వి.నటరాజ్, పాండిచ్చేరికి చెందిన ఆర్.శేఖర్, తమిళనాడు పెరంబూరు జిల్లాకు చెందిన ఆర్.బాలాజీపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో నిందితులకు జడ్జి పైవిధంగా శిక్ష విధించారు.

భక్తిప్రపత్తులతో అగ్నిగుండ ప్రవేశం





అగ్నిగుండంలో ప్రవేశిస్తున్న భక్తులు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో ఆదివారం అర్ధరాత్రి అంకమ్మ అగ్నిగుండం కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అమ్మవారికి పలు అభిషేకాలతో విశేషాలంకరణ చేసి పూజలు చేశారు. భక్తులు కంకణధారులై, బావుల్లో పవిత్ర స్నానమాచరించి, పసుపు దుస్తులు ధరించారు. గోవిందనామ స్మరణ చేస్తూ ఆలయ పూజారి ముందుగా పూలబంతిని అగ్నిగుండంలో వేసి ప్రవేశించారు. ఆయన్ను భక్తులు అనుసరించారు. వివిధ ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రేపు పాలిసెట్ ఉచిత మాక్ టెస్ట్

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి భవానీనగర్ సమీపంలోని శ్రీగగన విద్యాసంస్థలో బుధవారం ఉదయం 9గంటలకు పాలిసెట్ ప్రవేశ నమూనా పరీక్షను నిర్వహించన్నట్టు ఆ విద్యాసంస్థ డైరెక్టర్ ఎ.కరుణామూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 90140 52757, 95534 90099 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్ రాజశేఖర్, బాలసుబ్రమణ్యం

తిరుపతి రూరల్: రూరల్ మండలం సీ.గొల్లపల్లెలోని రాయలసీమ సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఫైనల్ ఇయర్ విద్యార్థుల ఫేర్‌వెల్ డే వేడుకలు సోమవారం కళాశాల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలతో హోరెత్తించారు. ఆటపాటలతో సందడి చేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ వై.కొండారెడ్డి, ప్రిన్సిపల్ రాజశేఖర్, కార్యదర్శి ఆనందరెడ్డి, ఎలక్ట్రికల్ విభాగాధిపతి బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో ముస్లింలు, గోపినాథ్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి సోమవారం రాత్రి తాతయ్యగుంటలోని అమీనియా మజీద్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముస్లిం మత పెద్ద హజరత్ అబ్దుల్ రహెమాన్, చాన్‌బాషా, ఏ–1 మస్తాన్, పీరూ సాహెబ్, రఫీ బాషా, ఖాదర్‌బాషా, టి.సుబ్రమణ్యంరెడ్డి, పొన్నాల జేజిరెడ్డి, ఎ.రాజా, శేఖర్‌రెడ్డి, అయాత్ బాషా, షేక్ అహ్మద్, గౌస్‌బాషా, ముస్లింలు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వేణుగోపాలపురానికి చెందిన పోలమ్మ సోమవారం 108 అంబులెన్స్‌లో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. పోలమ్మకు ప్రసవ నొప్పులు వస్తున్నాయని 108 సిబ్బందికి సమాచారం వచ్చింది. దీంతో ఆమెను 108 సిబ్బంది బుచ్చినాయుడు కండ్రిగ పీహెచ్‌సీకి తీసుకొస్తుండగా మార్గమధ్యంలో మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్టు ఈఎంటీ మానస తెలిపారు.

వేడుకగా ప్రదోష పూజలు

పిచ్చాటూరు: త్రయోదశి పురస్కరించుకుని నాగలాపురం మండలం సురుటపల్లె శ్రీ పళ్లికొండేశ్వరాలయంలో సోమవారం ప్రదోష పూజలకు భక్తులు పోటెత్తారు. సాయంత్రం ఆలయంలోని స్వయంభు శ్రీ వాల్మీకేశ్వరస్వామికి అభిముఖంగా ఉన్న నందీశ్వరునికి పాలు, పెరుగు, కొబ్బరినీళ్లు, చందనం, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం పలు రకాల పుష్పాలతో నందీశ్వరుని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలు నడుమ నందీశ్వరునికి టెంకాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు ఇచ్చారు. అంతకు ముందు ఆలయంలో కొలువుదీరిన శ్రీ మరగదాంబిక సమేత వాల్మీకేశ్వర స్వామి, మంగళాదేవి సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి, దాంపత్య దక్షిణామూర్తి, రామలింగేశ్వర స్వామిలకు ప్రత్యేక అభిషేక పూజలు చేసి అలంకరించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులకు ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు.

చంద్రబాబు వల్లే రాష్ట్రానికి రాజధాని సమస్య

- నారా లోకేష్ కూడా జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించడమా?
- ఆయన కనీసం కౌన్సిలర్‌గా అయినా గెలిచి తర్వాత మాట్లాడాలి
- పల్నాడులో రాజకీయం ఎప్పుడూ హాట్‌గానే ఉంటుంది
- టీటీడీ నిర్ణయాలు చాలా ఆనందం
- తిరుమలలో మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



తిరుమల ఆలయం వెలుపల మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

తిరుమల: చంద్రబాబు వల్లే రాష్ట్రానికి రాజధాని సమస్య వచ్చిందని మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. నారా లోకేష్‌ది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించే స్థాయి కాదన్నారు. అతను కనీసం కౌన్సిలర్‌గా అయినా గెలిచిన తర్వాత ముఖ్యమంత్రిపై విమర్శలు చేయాలని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హితవు పలికారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు కారణంగానే రాష్ట్రానికి రాజధాని సమస్య ఉత్పన్నమైందన్నారు. పల్నాడులో రాజకీయం ఎప్పుడూ హాట్‌గానే ఉంటుందని, అందుకు తగ్గట్టుగానే రాబోవు ఎన్నికల్లో ఏడుకు ఏడు సీట్లు వైఎస్సార్ సీపీ గెలవబోతోందన్నారు.

టీటీడీ నిర్ణయాలు అభినందనీయం

టీటీడీ ఈవోగా ధర్మారెడ్డి బాధ్యతలు స్వీకరించాక తిరుమలలో పైరవీలకు చెక్ పడిందని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు. సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇచ్చేలా తిరుమల–తిరుపతి దేవస్థానం నిర్ణయాలు తీసుకోవడం చాలా సంతోషం అన్నారు. సామాన్యులకు, ఇటు వీఐపీలకు ఇబ్బంది లేకుండా నిర్ణయాలు తీసుకోవడం అభినందనీయని ప్రశంసించారు. కొంతమంది అసౌకర్యం కలిగినంత మాత్రాన టీటీడీపై విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు.

శ్రీవారి సేవలో..

పత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీ పూర్ణచంద్ర ప్రసాద్, తెలంగాణ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి కూడా సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం పలికారు. అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

టీడీఆర్ బాండ్లను సకాలంలో ఇవ్వండి



మాస్టర్‌ప్లాన్ రోడ్ల వివరాలను కమిషనర్‌కు వివరిస్తున్న ఉద్యోగి

- కమిషనర్ హరిత

తిరుపతి తుడా : తిరుపతి నగర అభివృద్ధిలో భాగంగా మాస్టర్‌ప్లాన్ రోడ్లను శరవేగంగా పూర్తిచేస్తున్న నేపథ్యంలో స్థలాలు కోల్పోయిన వారికి సకాలంలో టీడీఆర్ (ట్రాన్సరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) బాండ్లను ఇవ్వాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత అధికారులకు ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధి, టీడీఆర్ బాండ్లపై సోమవారం టౌన్ ప్లానింగ్ అధికారులతో ఆమె సమీక్షించారు. పక్కా కొలతలను తీసుకొని వాటి ఆధారంగా టీడీఆర్ బాండ్లను ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా సిద్ధం చేయాలన్నారు. గంగజాతర మే మొదటి వారంలో నిర్వహించనున్న నేపథ్యంలో గంగమ్మ గుడి మాస్టర్ ప్లాన్‌రోడ్‌ను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని ఆదేశించారు. రోడ్ల అభివృద్ధిలో ఎక్కడైనా లీగల్ సమస్యలు ఎదురైతే వాటి పరిష్కారం కోసం ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, ఏసీపీలు బాలసుబ్రమణ్యం, షణ్ముగం, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సాయిలీల, శారదాంబ, జగదీష్, ధర్మరాజులు పాల్గొన్నారు.

అపోలోలో అత్యాధునిక గుండె వైద్యసేవలు



డాక్టర్ గిరీష్ నవసుందిని సత్కరిస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

తిరుపతి తుడా : అపోలోలో ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందిస్తున్నట్లు ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ గిరీష్ బి.నవసుంది తెలిపారు. తిరుపతిలోని ఓ హోటల్‌లో సోమవారం రాత్రి తిరుపతి ఐఎంఏ ఆధ్వర్యంలో బెంగళూరు అపోలో హాస్పిటల్స్ సహకారంతో వైద్యులకు గుండె, క్యాన్సర్ ఆంకాలజీలపై దృశ్యమాధ్యమంతో అవగాహన కల్పించారు. డాక్టర్ గిరీష్ నవసుంది మాట్లాడుతూ, అపోలోలో రోబోటిక్ సర్జరీ విధానాలతో గుండె, క్యాన్సర్ శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు చెప్పారు. అత్యాధునిక వైద్యాన్ని పరిచయం చేసేందుకు తాము అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ హరికృష్ణ, కార్యదర్శి డీఎల్ వెంకటేష్, అపోలో వైద్యులు డాక్టర్ ఆదిత్య మురళి, డాక్టర్ రవిచంద్రన్, తిరుపతిలోని ప్రముఖ వైద్యనిపుణులు పాల్గొన్నారు.

ఏపీ ఎస్పీఎఫ్ సిబ్బందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సిబ్బంది

తిరుమల: ఏపీ ఎస్పీఎఫ్ కమాండెంట్ శంకర్‌రావు ఆధ్వర్యంలో జూ పార్క్ రోడ్డులోని కార్యాలయంలో సిబ్బందికి సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఏపీ ఎస్పీఎఫ్ సిబ్బంది వారి ఆరోగ్యానికి సంబంధించిన అన్ని పరీక్షలను ఉచితంగా చేయించుకోవచ్చని, నారాయణాద్రి హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరం 19వ తేదీ వరకు నిర్వహిస్తామని కమాండెంట్ తెలిపారు. రక్త పోటు, మధుమేహం, ఈసీజీ మొదలగు పరీక్షలు కూడా చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు కృష్ణయ్య, సత్యం నాయుడు, అలిపిరి చెక్ పాయింట్ ఇన్‌స్పెక్టర్ పద్మలోచన పాల్గొన్నారు.



కీ.శే. శ్రీ వెంబులూరు రామకృష్ణా రెడ్డి గారు
13/571-B, తాతా నగర్, తిరుపతి.

17వ వర్ధంతి

అమృతం కన్నా నీ మనసు మిన్న...
వెన్నెల కన్నా నీ చూపులు చల్లన...
మంచితనం, మానవత్వం కలగలపిన మూర్తివి...
మామదిలో కొలువైన దేవుడవి నువ్వు
ఎన్ని జన్మలెత్తినా నీవే కావాలని కోరుకునే...

భార్య: కీ॥శే॥ వి.కాంతమ్మ

కుమారులు - కోడళ్ళు

ప్రొ॥ వి.నారాయణరెడ్డి   ప్రొ॥ సుధ
Founder Registrar, V.S University, Nellore
Member, AP SE Regulatory Commission, Govt. of AP   SPMVV

శ్రీ వి. రామచంద్రా రెడ్డి - శ్రీమతి రాణి
S.C. Railways, Tirupati.

శ్రీ వి. నాగేంద్ర రెడ్డి - శ్రీమతి మణెమ్మ
School Asst., ZPHS, Sathyanarayanapuram, Tirupati

కుమార్తె - అల్లుడు

శ్రీమతి ఎ. పద్మావతి - శ్రీ ఎ. వెంకట రెడ్డి
AEE (Electrical), TTD, Tirupati

మరియు మనుమలు, మనుమరాండ్రు